క్లుప్తంగా

'డోర్నకల్‌లో కాంగ్రెస్ జెండా ఎగరేస్తా'



కురవి : కాంగ్రెస్ పార్టీ డోర్నకల్ నియోజకవర్గ టికెట్ ఇస్తే అత్యధిక మెజార్టీతో గెలిచి జెండా ఎగరేస్తానని కిసాన్ పరివార్ అధినేత నునావత్ భూపాల్‌నాయక్ తెలిపారు. ఆయన డోర్నకల్ టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్న క్రమంలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లో బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి మాట్లాడారు. ఆయన వెంట నాయకులు జెరిపోతుల రంగన్నగౌడ్, డీవై.గిరి, గాంధీ నాయక్, అచ్యుత్‌రావు, శివ ఉన్నారు.

బండి సంజయ్‌ని కలిసిన నాయకులు



తొర్రూరు : బీజేపీ నేత, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌ను ఆ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్, రాష్ట్ర నాయకుడు పెదగాని సోమయ్య కరీంనగర్‌లో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతానికి నాయకులకు సంజయ్ సూచనలు చేశారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నాయకులకు సంజయ్ దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో నాయకులు పరుపాటి రామ్మోహన్‌రెడ్డి, బొమ్మన బోయిన కుమార్, భిక్షం నాయక్ పాల్గొన్నారు.

'గృహలక్ష్మి' వసూళ్లపై గొడవ..!

నెల్లికుదురు : మండలంలోని సొల్లతండాలో గృహలక్ష్మి పథకం అమలులో వసూళ్లపై బుధవారం గొడవ జరిగింది. సర్పంచ్ మంగ్య నాయక్, బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు దేవేందర్ గృహలక్ష్మి సాయం ఇప్పిస్తామంటూ పలువురి నుంచి డబ్బులు వసూలు చేసినట్లు సమాచారం. ఈ క్రమంలో ఇద్దరి మధ్య పంపకాల్లో తేడా రావడంతో తండావాసుల సమక్షంలో గొడవ జరిగినట్లు తెలిసింది.

దివ్యాంగుల బంధు ప్రకటించాలని వినతి

కురవి : దివ్యాంగుల బంధు పథకం ప్రకటించాలని కోరుతూ వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్పీఆర్డీ) ఆధ్వర్యంలో ఎంపీడీఓకు బుధవారం వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఖాజా మాట్లాడారు. దివ్యాంగులు అత్యంత వెనుకబడి ఉన్నారని తెలిపారు. దివ్యాంగులకు గృహలక్ష్మీ పథకంలో 5 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ముత్తినేని సీతారామయ్య, బత్తిని వెంకన్న, ఇర్రి యాకయ్య, కర్నాటి మల్లికార్జున్ పాల్గొన్నారు.

ఇబ్బందులకు గురి చేస్తే చర్యలు తప్పవు

డోర్నకల్ : ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ బి.ఉపేందర్‌రావు తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గడచిన నెల రోజుల్లో పోలీస్‌స్టేషన్ పరిధిలో రద్దీ ప్రాంతాల్లో మద్యం సేవిస్తున్న 25 మందిపై, మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 33 మందిపై కేసులు నమోదు చేశామన్నారు. రోడ్లపై వ్యాపారాలు నిర్వహిస్తూ ట్రాఫిక్ సమస్యలకు కారణమవుతున్న వారిపైనా కేసులు పెట్టినట్లు తెలిపారు. వినాయక నిమజ్జనం సందర్భంగా 23 మంది డీజే నిర్వాహకులను బైండోవర్ చేసినట్లు సీఐ ఉపేందర్‌రావు తెలిపారు. సమావేశంలో ఎస్సై ఝాన్సీ పాల్గొన్నారు.

డీజేలు సీజ్

గార్ల : ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా మండలంలోని బుద్దారంలో గణేష్ నిమజ్జనం సందర్భంగా ఊరేగింపులో వినియోగించిన 2 డీజేలను సీజ్ చేసినట్లు సీఐ బాబూరావు తెలిపారు. గణేష్ నిమజ్జనంలో డీజేలు వినియోగిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

సాంస్కృతిక కార్యక్రమాలను విజయవంతం చేయాలి

మరిపెడ రూరల్ : వినాయక ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని ఆర్‌ఎస్.నగర్ వినాయక మండపం వద్ద నేడు (గురువారం) నిర్వహించనున్న సాంస్కృతిక కార్యక్రమాలను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. ఈ సందర్భంగా కమిటీ నిర్వాహకులు బుధవారం మాట్లాడారు. మండలంలోని ప్రైవేట్, ప్రభుత్వం పాఠశాల విద్యార్థులకు గురువారం సాయంత్రం 6 గంటల నుంచి క్లాసికల్, జానపద నృత్యం, ఇతర సాంస్కృతికి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.3,116, ద్వితీయ బహుమతిగా రూ.2,116, తృతీయ బహుమతిగా 1,116లు నగదుతోపాటు షీల్డ్ అందించనున్నట్లు తెలిపారు. సెల్ నంబర్ 99484 56873లో సత్తిరెడ్డిని, సెల్ నంబర్ 9949610481లో వెంకన్నను సంప్రదించాలని కోరారు.



కురవి : మట్టి గణపతిని తీసుకెళ్తున్న భక్తులు



మహబూబాబాద్ : మూడుకొట్ల సెంటర్‌లో..



మహబూబాబాద్ రూరల్ : ఉద్వాసన పూజలో..

గణనాథుడికి ఘనంగా వీడ్కోలు

నవరాత్రుల ముగింపు సందర్భంగా జిల్లాలోని అన్ని మండలాల్లో నిర్వాహకులు గణపతి విగ్రహాలకు బుధవారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఉదయం నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించిన గజానన మండళ్ల నిర్వాహకులు మధ్యాహ్నం ఇంటింటికీ ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వినాయకుడి లడ్డూలకు వేలం వేయగా భక్తులు లక్షలాది రూపాయలు చెల్లించి సొంతం చేసుకున్నారు. సాయంత్రం 4 గంటల నుంచి అత్యంత వైభవంగా తీర్చిదిద్దిన వాహనాల్లో గణనాథుడిని ఊరేగిస్తూ నిమజ్జనం చేశారు. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.

–సాక్షి నెట్‌వర్క్



కేసముద్రం : గణనాథుడిని ఊరేగిస్తున్న భక్తులు



బయ్యారంలో..



మరిపెడలో..



మరిపెడ రూరల్: విగ్రహాన్ని తరలిస్తున్న రవిచంద్ర



గూడూరులో..



డోర్నకల్ : ఉయ్యాలవాడలో..



పాలకుర్తి టౌన్ : విగ్రహం ఎదుట కోలాటం

'సింహగర్జన'ను విజయవంతం చేయాలి

మహబూబాబాద్ అర్బన్ : సమస్యల పరిష్కారం, హక్కుల సాధన కోసం అక్టోబర్ 1న హనుమకొండ జిల్లాలోని పరకాలలో తలపెట్టిన ముదిరాజ్ సింహగర్జనను విజయవంతం చేయాలని ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులి దేవేందర్ కోరారు. జిల్లా కేంద్రంలోని ఆ సంఘ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో దేవేందర్ మాట్లాడారు. తెలంగాణలో 60 లక్షల జనాభాతో అధిక శాతం ఓటింగ్ బలమున్న ముదిరాజ్ కులస్తులను రాజకీయ పార్టీలు విస్మరిస్తున్నాయని ఆందోళన వెలిబుచ్చారు. జనాభాకు అనుగుణంగా చట్టసభల్లో వాటా కల్పించాలని రాజకీయ పార్టీలను డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కసువు వెంకటరమణ, జిల్లా ఉపాధ్యక్షులు చిల్ల నిరంజన్, నాయకులు జెట్టి యాకయ్య, బోయిని నరేందర్, దువ్వ సైదులు, దుండి మల్సూర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పులి దేవేందర్

టీషర్టులు పంపిణీ



మహబూబాబాద్ : ఆర్‌ఎల్‌ఎస్ ఇండస్ట్రీస్ యాజమాని యశ్వంత్ అందించిన టీషర్టులను నిజాం చెరువు వద్ద ఏర్పాటు చేసిన వేదిక వద్ద గజ ఈతగాళ్లకు, సిబ్బందికి మున్సిపల్ చైర్మన్ డాక్టర్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి, డీఎస్పీ సత్యనారాయణ పంపిణీ చేశారు.

గార్ల : స్థానిక వర్తక సంఘం భవనంలోని గణేష్ మండపం వద్ద గణేష్ యువసేన నిర్వాహకులు 100 మంది పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు.

రైతులకు సేవలందించడమే లక్ష్యం

గూడూరు : రైతులకు సేవలందించడమే లక్ష్యంగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) పాలక కమిటీ పని చేస్తోందని అధ్యక్షుడు చల్ల లింగారెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో బుధవారం మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గత కార్యవర్గ సమావేశంలో జరిగిన తీర్మాణాలను ధృవీకరించి ఆమోదించారు. అనంతరం చైర్మన్ మాట్లాడారు. సంఘంలోని 6918 మంది సభ్యులకు రుణాలు అందిస్తూ, రెన్యూవల్ చేశామన్నారు. ప్రభుత్వం ఇచ్చిన రుణమాఫీ సంఘంలోని 243 మంది రైతులకు రూ.1 కోటీ 18 లక్షలు రాగా మరో 361 మంది రైతులకు రూ.1 కోటీ 72 లక్షలు రావాల్సి ఉందని తెలిపారు. రబీలో రైతుల నుంచి 84,441 బస్తాల వరి ధాన్యం కొనుగోలు చేసినట్లు చెప్పారు. రైతులకు ఎరువులు, విత్తనాలను సకాలంలో అందిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ ఉపాధ్యక్షుడు వేం శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్లు తవ్వల జయపాల్, నలమాస యాకయ్యగౌడ్, తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న లింగారెడ్డి

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

చిన్నగూడూరు : సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలని ఉగ్గంపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కరుణాకర్ సూచించారు. మండలంలోని మన్నెగూడెంలో బుధవారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో సుమారు 110 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. జ్వర పీడితుల రక్తనమూనాలు సేకరించారు. పలువురికి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కరుణాకర్ మాట్లాడారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలని సూచించారు. అనారోగ్య పరిస్థితులు చోటు చేసుకుంటే సమీపంలోని పీహెచ్‌సీలో వైద్యం చేయించుకోవాలని చెప్పారు. వ్యాధులను నిర్లక్ష్యం చేయొద్దని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ వెంకటేశ్వర్లు, ఎంఎల్‌హెచ్ పి.తార, ధర్మేంద్ర, ఏఎన్ఎం శ్యామల, ఆశవర్కర్లు పుష్ప, సంధ్య, పంచాయతీ కార్యదర్శి స్వరూప తదితరులు పాల్గొన్నారు.



వైద్యశిబిరంలో వైద్యులు, సిబ్బంది

బయోమెట్రిక్ విధానాన్ని రద్దు చేయండి

నెహ్రూసెంటర్ : కార్మిక శాఖ కార్యాలయంలో బీమా దరఖాస్తు, లేబర్ కార్డులు పొందేందుకు ప్రవేశపెట్టిన బయోమెట్రిక్ విధానాన్ని రద్దు చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పర్వత కోటేష్, హలావత్ లింగన్న కోరారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని లేబర్ కార్యాలయంలో అసిస్టెంట్ లేబర్ అధికారి రమేష్‌కు బుధవారం వినతిపత్రం అందజేసి మాట్లాడారు. బయోమెట్రిక్ విధానం వల్ల ఆన్‌లైన్ పని చేయక ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. ప్రయోజనాలు పొందాలంటే కార్డు హోల్డర్‌తోపాటు కుటుంబ సభ్యులు వేలిముద్ర వేయాల్సి వస్తోందని చెప్పారు. గంటల తరబడి మీ సేవా కేంద్రాల వద్ద ఎదురు చూస్తున్నట్లు వాపోయారు. పెండింగ్‌లో ఉన్న క్లెయిములకు సంబంధించి వెంటనే నిధులు విడుదల చేయాలని, కార్మిక శాఖలోని ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలని, 50 ఏళ్ల వయస్కులైన కార్మికులకు రూ.6 వేల పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జబ్బార్, తెల్లబోయిన లక్ష్మయ్య, సురేష్, రాంమూర్తి, ఉప్పలయ్య, లింగన్న, పాపయ్య పాల్గొన్నారు.



అధికారికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉద్యమకారులకు రూ.25 వేల పింఛన్ ఇవ్వాలి

గార్ల : తెలంగాణ మలిదశ పోరాటంలో ఉద్యమించిన వారికి రూ.25 వేల చొప్పున పింఛన్ ఇవ్వాలని బీఎస్పీ మండల అధ్యక్షుడు అజ్మీర వెంకన్న డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఉద్యమకారులు చేపట్టిన నిరాహార దీక్షలు బుధవారం 4వ రోజుకు చేరుకున్నాయి. దీక్షా శిబిరాన్ని వెంకన్న, పలు రాజకీయ పార్టీల, ఉపాధ్యాయ సంఘాల నాయకులు సందర్శించి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడారు. కార్యక్రమంలో ఉద్యమకారులు జడ సత్యనారాయణ, భూక్యా నాగేశ్వరరావు, పి.వీరస్వామి, జగదీష్, యాకూబ్‌పాషా, తోడేటి శ్రీనుగౌడ్, సునీత, జానీమియా, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కొండా లక్ష్మణ్‌బాపూజీ జయంతి

సాక్షి నెట్‌వర్క్ : జిల్లాలోని మహబూబాబాద్, తొర్రూరు, దంతాలపల్లి, కేసముద్రం, చిన్నగూడూరు మండలాల్లో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నాయకులు, ప్రజలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ఆయన సాగించిన పోరాటాన్ని వక్తలు స్మరించారు.



మహబూబాబాద్ : లక్ష్మణ్‌బాపూజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్, సిబ్బంది

పూలే ఆశయాలను కొనసాగించాలి

నెహ్రూసెంటర్ : మహాత్మ జ్యోతిరావు పూలే ఆశయాలను కొనసాగించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య కోరారు. పూలే సత్యశోధక్ సమాజ్‌ను స్థాపించి 150 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా జిల్లా కేంద్రంలోని పూలే విగ్రహానికి నాయకులు బుధవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఐలయ్య మాట్లాడారు. కుల నిర్మూలన కోసం పూలే సత్యశోధక్ సమాజ్‌ను స్థాపించారని చెప్పారు. పూలే కృషి భవిష్యత్ తరాలకు ఆదర్శమన్నారు. పూలే స్ఫూర్తితో పాలకుల తప్పుడు విధానాలపై ప్రజలు వర్గపోరాటాలకు సిద్ధం కావాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ సబ్ డివిజన్ సహాయ కార్యదర్శి గుజ్జు దేవేందర్, తాజ్‌పాషా, పీవైఎల్ జిల్లా కార్యదర్శి బట్టు చైతన్య, ఏఐకేఎంఎస్ నాయకులు యుగంధర్, బాలమల్లు, మౌత్య తదితరులు పాల్గొన్నారు.

బయ్యారం : మండల కేంద్రంలో జ్యోతిరావుపూలే–సావిత్రి దంపతుల విగ్రహాలకు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం న్యూడెమోక్రసీ సబ్ డివిజన్ కార్యదర్శి నందగిరి వెంకటేశ్వర్లు మాట్లాడారు. కులరహిత సమాజ నిర్మాణం కోసం సమాజంలోని ప్రతిఒక్కరూ పోరాడాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు వెంకన్న, మురళి, పునేష్, ఉప్పలయ్య, సీతారాములు, సోమక్క, సత్యం, భిక్షం, సహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలపై నిర్లక్ష్యం తగదు

మహబూబాబాద్ : అంగన్‌వాడీల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదని సీఐటీయూ జిల్లా నాయకుడు కుమ్మరికుంట్ల నాగన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ సమీపంలో అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె బుధవారం 17వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు రాస్తారోకో నిర్వహించగా నాగన్న మాట్లాడారు. అంగన్‌వాడీలు న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం శాంతియుతంగా సమ్మె చేస్తుండగా ప్రభుత్వం స్పందించకపోవడం సరికాదన్నారు. ఇకనైనా ప్రభుత్వం అంగన్‌వాడీల అన్ని సమస్యలనూ పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్నేహబిందు, అండాలు, ఉపేంద్ర, మరియమ్మ, లలిత, సౌమ్య, సునీత, తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడ : మండల కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు శ్రీశైలం మాట్లాడారు. కార్యక్రమంలో న్యూడెమోక్రసీ నాయకులు యాదగిరి యుగేందర్, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

నెల్లికుదురు : మండల కేంద్రంలో అంగన్‌వాడీలు రాస్తారోకో నిర్వహించగా సీఐటీయూ మండల కార్యదర్శి ఈసంపెల్లి సైదులు, ఏఐటీయూసీ మండల కార్యదర్శి బైస స్వామి మద్దతు తెలిపి మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మినర్సమ్మ, వీరలక్ష్మి, సరస్వతి, వెంకటలక్ష్మి, పద్మ, మంజుల, అరుణ, ఎల్లమ్మ, విజయ పాల్గొన్నారు.



కొత్తగూడ : ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

కురవి : మండల కేంద్రంలోని బస్టాండ్ ఎదుట ఖమ్మం రహదారిపై అంగన్‌వాడీలు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ పోతుగంటి మల్లయ్య, అంగన్‌వాడీ ఉద్యోగుల సంఘం నాయకురాలు గుగులోతు సరోజ మాట్లాడారు. కార్యక్రమంలో సంధ్య, కుమారి, రూప, నాగేంద్ర, కవిత, మంగమ్మ, మహాలక్ష్మీ, పద్మ, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

గార్ల : మండల కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ కందునూరి శ్రీనివాసరావు, నాయకులు నీలాదేవి, పద్మ, సుజాత, కృష్ణకుమారి, సరిత, శ్రీలక్ష్మి, విక్టోరియా, తదితరులు పాల్గొన్నారు.


సంక్షిప్త సమాచారం

భగత్‌సింగ్ జయంతి వేడుక



గార్ల : పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో మండలంలోని మద్దివంచ గ్రామంలోని ప్రభుత్వ హైస్కూల్లో భగత్‌సింగ్ 116వ జయంతి వేడుకలను బుధవారం నిర్వహించారు. తొలుత భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం మండల కార్యదర్శి మహేష్‌కుమార్, నాయకులు చరణ్, సంజన, మేఘన, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపిక



పెద్దవంగర : ఈనెల 25, 26 తేదీల్లో నిర్వహించిన జోన్ స్థాయి క్రీడల్లో మండలంలోని చిన్నవంగర కేజీబీవీ నుంచి 9 మంది విద్యార్థులు అండర్–14, 17 విభాగాల్లో ప్రతిభ చాటి కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీల్లో జిల్లా స్థాయికి ఎంపికైనట్లు పీఈటీ పావని తెలిపారు. కబడ్డీలో అకిల, సిరి, దివ్య, త్రివేణి, శ్రీజ, ఖోఖోలో లక్ష్మీ ప్రసన్న, మానస, హనిక, చైతన్య ప్రతిభ ఎంపికవగా వారికి ఎస్‌ఓ స్రవంతి బుధవారం పాఠశాలలో బహుమతులు అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కళ్యాణి, సరిత, సంధ్యారాణి, సైదమ్మ, శ్రీలత పాల్గొన్నారు.

డ్రోన్‌తో పురుగుమందుల పిచికారీపై అవగాహన

పెద్దవంగర : డ్రోన్ సాయంతో పురుగుమందుల పిచికారీపై రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు బొమ్మకల్లు ఎంపీటీసీ బానోత్ రవీందర్‌నాయక్ తెలిపారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం మినిస్ట్రీ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ట్రైనింగ్, నేషనల్ స్కిల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. డ్రోన్ సాయంతో పిచికారి చేస్తే సమయంతోపాటు డబ్బు ఆదా అవుతుందని చెప్పారు.

కాంట్రాక్టు ప్రాతిపదికన ఉద్యోగ అవకాశం

నెహ్రూసెంటర్ : నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్ఎం) కింద కాంట్రాక్ట్ ప్రాతిపదికన అర్హులకు ఉద్యోగ అవకాశం కల్పించనున్నట్లు జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ డయాగ్నోస్టిక్ టి హబ్‌లో ఖాళీగా ఉన్న మైక్రోబయాలజిస్ట్, ఫార్మసిస్టు పోస్టులకు నేషనల్ హెల్త్ మిషన్ కింద దరఖాస్తులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. ఒక్కో పోస్టునకు ఎండి (మైక్రోబయాలజీ), బి.ఫార్మసీ/ డి.ఫార్మసీ అర్హతలు కలిగిన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని తెలిపారు. అక్టోబర్ 10న ఉదయం 11 గంటల వరకు అర్హత కలిగిన అభ్యర్థులు ధ్రువీకరణ పత్రాలతో వాక్ ఇన్ ఇంటర్వ్యూకు హాజరు కావాలని పేర్కొన్నారు. మహబూబాబాద్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో సూపరింటెండెంట్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు జరుగుతాయని వివరించారు. ఎంపికైన అభ్యర్థుల్లో మైక్రో బయాలజిస్టుకు రూ.లక్ష, ఫార్మసిస్టునకు రూ.17 వేలు చొప్పున నెలవారి వేతనంగా చెల్లించనున్నట్లు తెలిపారు. అర్హులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రాష్ట్రపతి అవార్డుకు మండల వాసి ఎంపిక

పాలకుర్తి : జాతీయ సేవా పథకం విభాగంలో మండలంలోని గూడూరు గ్రామానికి చెందిన గుండె పరశురాములుకు రాష్ట్రపతి అవార్డుకు ఎంపికయ్యారు. ఈనెల 29న ఢిల్లీలో రాష్ట్రపతి ముర్ము చేతుల మీదుగా పరశురాములు అవార్డు అందుకోనున్నారు. పేద కుటుంబానికి చెందిన పరశురాములు ఎంబీఏ చదివాడు. అనేక సామాజిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నాడు. ఆయన అవార్డుకు ఎంపికవడం పట్ల మహాత్మ సొసైటీ వ్యవస్థాపకుడు గంట రవీందర్, చుక్కా రామయ్య ఫౌండేషన్ అధ్యక్షుడు మాచర్ల పుల్లయ్య హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రపతి అవార్డుకు ఎంపికైన సందర్భంగా పరశురాములును పలువురు అభినందనలు తెలిపారు.

బహుజనులు ఉద్యమించాలి



గూడూరు : రాజ్యాధికారం కోసం బహుజనులు ఉద్యమించాలని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి దార్ల శివరాజ్ కోరారు. మండల కేంద్రంలో ఆ పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ ప్రసాదరావు ఆధ్వర్యంలో జెండా పండుగను పురస్కరించుకొని బుధవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రధాన సెంటర్‌లో జెండాను శివరాజ్ ఆవిష్కరించి మాట్లాడారు. అగ్రవర్ణ పార్టీలైన కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల పట్ల వివక్ష పాటిస్తున్నాయని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో ఏనుగు గుర్తుకు ఓటేసి పార్టీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు విజయ్‌కాంత్, ఈసంపెల్లి ఉపేందర్, ఎడ్ల శ్రీనివాస్, తోకల నాగరాజ్, మహేందర్, హేమంత్ పాల్గొన్నారు.

పరామర్శ

మహబూబాబాద్ రూరల్ : వైఎస్సార్టీపీ మానుకోట నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుగులోత్ రాములునాయక్ కొడుకు, కోడలు, మనవరాలు కాజీపేట దర్గా ఉర్సులో గ్యాస్ సిలెండర్ పేలిన ఘటనలో గాయపడగా పార్టీ కేసముద్రం మండల అధ్యక్షుడు బషీర్ ఖాన్, బీఆర్‌ఎస్ అర్పనపల్లి అధ్యక్షుడు గంధంశ్రీ యాదగిరి బుధవారం పరామర్శించారు. బోడతండలో రాములునాయక్ మనవరాలిని పరామర్శించి రూ.5 వేల సాయం అందజేశారు.

పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యత

మరిపెడ రూరల్ : పర్యావరణ పరిరక్షణను సామాజిక బాధ్యతగా నీలికుర్తి సర్పంచ్ గుడిపూడి శ్రీనివాసరావు అభివర్ణించారు. 'స్వచ్ఛత హీ సేవ' కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఆ గ్రామంలో పంచాయతీ ఆధ్వర్యంలో బుధవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడారు. ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ ఉప్పలయ్య, కార్యదర్శి రామ్మూర్తి, బీఆర్‌ఎస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నాగన్న, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

2 నుంచి కేవీపీఎస్ ఆవిర్భావ వేడుకలు

మరిపెడ రూరల్ : అక్టోబర్ 2 నుంచి 9 వరకు కేవీపీఎస్ 25వ ఆవిర్భావ వేడుకలు నిర్వహించనున్నట్లు మండల అధ్యక్షుడు తప్పెట్ల విజయ్ తెలిపారు. మరిపెడలోని ప్రజాసంఘాల కార్యాలయంలో, మండలంలోని అబ్బాయిపాలెంలో బుధవారం నిర్వహించిన మండల కమిటీ సమావేశాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. సంఘం పోరాట ఫలితంగానే అనేక హక్కులు లభించాయని చెప్పారు. అక్టోబర్ 2న అన్ని గ్రామాల్లో సంఘం జెండాలను ఎగరేయాలని, ఆవిర్భావ వేడుకలను జయప్రదం చేయాలని కోరారు. సమావేశాల్లో సంఘం నాయకులు వినయ్, వెంకటేష్, నవీన్, విజయ్, రమేష్, మధుసుదన్, నరేష్, పత్తిపాటి విజయ్, చింత వెంకటేష్, నందిపాటి నవీన్, మల్లెపంగా విజయ్, గోపి రమేష్, గోపి మధుసూదన్, వడ్లకొండ నరేష్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విజయ్